# భయము నుండి విడుదల

ఇదివరకు ఎన్నడు సంభవింపని భయాందోళన కాలము అంత్యదినములలో వచ్చునని ప్రభువైన యేసు ప్రవచించెను. ఆయననోట మాటలివి, "మరియు సూర్యచంద్ర నక్షత్రములలో సూచనలును, భూమిమీద సముద్ర తరంగముల ఘోషవలన కలవరపడిన జనములకు శ్రమయు కలుగును. ఆకాశమందలి శక్తులు కదలింపబడును గనుక లోకము మీదికి రాబోవుచున్నవాటి విషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురుచూచుచు ధైర్యముచెడి కూలుదురు." (లూకా 21:25-26).

అంతేగాక రాబోవు మరికొన్ని వాటిని గూర్చి యేసు తీవ్రమైన హెచ్చరికను చేసెను. "జనము మీదికి జనమును రాజ్యము మీదికి రాజ్యమును లేచును. అక్కడక్కడ కరువులును భూకంపములును కలుగును; ఇవన్నియు వేదలనకు ప్రారంభము. అప్పుడు జనులు మిమ్మును శ్రమలు పాలుచేసి చంపెదరు; మీరు నానామము నిమిత్తము సకలజనముల చేత ద్వేషింపబడెదరు.

అనేకులు అభ్యంతరపడి, యొకనినొకడు అప్పగించి ఒకనినొకడు ద్వేషింతురు. అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు; అక్రమము విస్తరించుటచేత అనేకులప్రేమ చల్లారును. అంతము వరకు సహించిన వాడెవడో వాడు రక్షింపబడును..... అప్పుడు మహాశ్రమ కలుగును..... అబద్ధ క్రీస్తులును అబద్ధ ప్రవక్తలును వచ్చి సాధ్యమైతే ఏర్పరచబడినవారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను, మహత్కార్యములను కనబరచెదరు.... కావున ఏ దినమున మీప్రభువు వచ్చునో మీకు తెలియదుగనుక మెలకువగా నుండుడి" (మత్తయి 24).

## భయమునకు కారణములు

నేడు రక్షింపబడినవారైతేనేమి, లేక రక్షింపబడని వారైతేనేమి, సర్వలోకమంతా అంత్యకాలముల పురిటినొప్పులను సాక్షాత్తూ చూస్తుంది. ఈ భయాందోళనను తీవ్రపరచునది అమెరికా మరియు ఇతర దేశముల ఆర్థికవ్యవస్థ కూలిపోవుట ఒకనవలోక ఆర్థిక విధానము తలయెత్తనైయున్నది (1992లో  ఐరోపా దేశములు సమైఖ్య పడాలని ఆలోచించిరి - ఈ ప్రణాళిక నిరాటంకముగ ఊహకుమించిన నెరవేర్పును చూచింది.

వాల్‌స్ట్రీట్ త్వరితముగ కూలిపోవునను వార్త బ్యాంకులను మరియు ద్రవ్య వ్యాపారస్తులను మిక్కిలి భయభ్రాంతులనుగా చేస్తున్నది. భూగోళమంతట జపాన్‌నుండి ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, స్విట్జర్‌లాండ్, జర్మనీ మరియు అమెరికా భయంకరమైన భయముచేత కంపించుచున్నది.

త్యాగము చేయుట లేక ఏదైనా లేకుండా బ్రతుకుట అమెరికాలో ఉన్న మనకు ఊహకందని విషయము. దీనికెంతమాత్రము మనము సిద్ధముగా లేము. లక్షలాదిమంది క్రైస్తవులు తమ ఉద్యోగాలు, కార్లు మరియు ఆస్తులు పోతాయేమోనను భయముతో అనుదినము జీవిస్తున్నారు, అకస్మాత్తుగా కలుగు ఆర్థిక ఉపద్రవము వారిని బొత్తిగా క్రుంగదీస్తుంది. వాతావరణములో మార్పులు కూడా ముందుగా తెలిసికోగలిగే రీతిలో ఉండుటలేవు. విపరీతమైన సంఖ్యలో తుఫానులు, భూకంపములు, ఉప్పెనలు మరియు ఘోరమైన ప్రమాదములు సంభవిస్తున్నవి. ఇవి దినదినము ఎక్కువ అవుతున్నవి. దీనినంతటిని మనము అర్థము చేసుకోలేము. బహువేగముతో ఇవి సంభవిస్తున్నవి.

ఈ మధ్యకాలములో జరుగుచున్న సంఘటనలపై వాఖ్యానిస్తూ ఒక వార్తావిలేఖరి ఇలా అంటున్నాడు, "దేవుడు మనల్ని శిక్షిస్తున్నాడా?" మరియొకరు "బహుసా మన ధ్యాసను ఆయన వైపుకి త్రిప్పుకొన ప్రయత్నిస్తున్నాడేమో!" ఇంకా కొందరు, "దేవుళ్ళకు కోపము చెలరేగింది" అని అంటున్నారు.

గత కొద్ది కాలములోనే భూమి తలక్రిందులయ్యింది. బెర్లిన్ ప్రాకారము కూలిపోయింది. హంగరీ, పోలెండ్, మరియు జెకోస్లేవేకియా, కమ్యూనిష్టులను పారద్రోలిరి. గోర్బచేవ్ ప్రజాస్వామ్యమును ప్రభోదించ ప్రయత్నిస్తున్నాడు. దీనితో ఫిడెల్ కేస్ట్రో గడగడ వణకుచున్నాడు. ఆస్ట్రేలియా దివాళా తీయనైయున్నది, ఎల్ సాల్వడోర్ కంపించుచున్నది, మెక్సికోలో సాంఘిక విప్లవములు తలయెత్తుచున్నవి. మరియు వెయ్యి సంవత్సరముల నిద్రతరువాత చైనా తిరిగిలేస్తుంది. దేశ రక్షణ అమెరికాలో అతిపెద్ద వ్యాపారము. శాంతి నెలకొల్పబడితే అది అనేకులకు కష్టాలు కొనితెస్తుంది.

ఎయిడ్స్ వ్యాధిని గూర్చి వేరే చెప్పాలా? వైద్య వ్యవస్థ కూలిపోవుచుండగ మత్తు పదార్థముల వ్యాపారము విస్తరిస్తుంది. పాఠశాలలో మరియు వీధులలో నేరాలను అరికట్టుట అసాధ్యమగుచున్నది. సమాజము పిచ్చెక్కిపోయున్నది. పరిస్థితులు మరింత విషమిస్తాయని

తెలిసిన అందరు భయము మరియు అయోమయం చేత పీడించబడుచున్నారు. ఎవరిదగ్గరా కూడా పరిష్కారము లేనట్లుగానే యున్నది.

సినిమాలు మరియు టి.వి. ఎంతవేగముగ చెడిపోతున్నవో చూడండి. రాబోవు కాలములో సీరియల్సులో పూర్తి నగ్నసన్నివేశముల ఉంటాయని అనుకుంటున్నారు. చరిత్రలో మొట్టమొదటిసారిగా ఇశ్రాయేలు దేశములో అశ్లీల పత్రికలు ప్రచురించబడుచున్నవి. మానవుని దురాశ అగ్నివలే చెలరేగుచున్నది. దీని అంతమేమిటి?

## అధికమైన జ్ఞానము మరింత భయమును మరియు విచారమును కలిగిస్తుంది.

బైబిలు గ్రంథము ఇలా సెలవిస్తుంది, "విస్తారమైన జ్ఞానాభ్యాసము చేత విస్తారమైన దుఃఖము కలుగును; అధికవిద్య సంపాదించినవానికి అధికసోకము కలుగును" (ప్రసంగి 1:18)

ప్రియులారా! కొలొస్ట్రాల్ లేక సాల్మొనెల్లా కోడిగ్రుడ్లలో ఉంటాయని, అవి నాకు హానికరమని నేను తెలిసికొన నిష్టపడుట లేదు. దీవెనకరమైన అజ్ఞానకాలములో నిర్భయముగా బేకెన్ మరియు గ్రుడ్లు తిన్నాను. కాని ఇప్పుడు "నీవు హంతకురాలివి! నాకు విషముపెట్టి నన్ను చంపనైయున్నావు!" అని తలంచకుండా ఒక గ్రుడ్డును చూడనైనా చూచుటలేదు. ఈ పరిజ్ఞానము వెనుక ఇంత సోకము ఉన్నది.

తరువాత కొలొస్ట్రాల్‌ను తగ్గించుట మొదలిడిన తరువాత దానివలన మేలేఉందని చదివాను. జొన్నలు, గోధుమలు మరియు పండ్లు తినుట నేర్చుకొన్నప్పుడు, అందరూ చెప్పుకొనుచున్నట్లు వాటివలన కూడా పెద్ద ఉపయోగము లేదని తేలింది. పంచదార హానికరమని తెలిసి శాకరిన్ వాడుచుంటిమి. కాని అది ఎలుకలలో కేన్సర్ వ్యాధిని కలిగిస్తుందని తెలుస్తుంది.

గ్యాస్ట్రిక్ సమస్యలకు వాడే మందులలో ఉన్న అల్యూమినియం వలన ఆల్‌జైమర్ వ్యాధి సోకుతుందని కొందరంటున్నారు. కోడి మాంసములో సాల్మొనెల్లా ఉందని, చేపలలో అయోడిన్ ఉందని మరియు ఏపిల్స్‌వలన కేన్సర్ వ్యాధి వస్తుందని పరిశోధకులు తెలియజేస్తున్నారు. ఒకప్పుడు దేనినైతే ప్రమాదకరమని అన్నారో అదే ఉపయోగకరమని ఇప్పుడు తేలుస్తున్నారు.

ఫ్రిడ్జ్ తెరుచుటకే భయపడుతున్నాను. కొలొస్ట్రాల్, రసాయనిక ద్రవములు మరియు ప్రిజర్‌వేటివ్స్, మేమందరము ఇక్కడ ఉన్నాము, అని మరణకేకలు వేస్తున్నాయి. ఇంత "అద్భుతకరమైన" జ్ఞానము లేకపోయియుంటేనే మేలగునేమో. నిజమునకు వీటిని గూర్చిన తెలివి, భయమును మరియు చింతను పెంపొందింప జేస్తున్నాయి.

## నిర్భయముగా జీవించుట

ఈ మధ్యకాలములో న్యూజర్సీ ప్రాంతములో నేను నడుస్తూ ప్రభువుతో ఇలా సంభాషించాను. "ప్రభువా! ఇన్ని రకముల భయములు మరియు చింతలతో నేను జీవించలేకయున్నాను, భవిష్యత్తును సంతోషము మరియు నిబ్బరమైన మనస్సుతో ఎదిరించనిష్టపడుచున్నాను! భయాందోళన నుండి పూర్తి విడుదల నాకు కావాలి!"

అప్పుడు పరిశుద్ధాత్ముడు నన్ను ఈ మాటలతో ప్రోత్సహించెను. 'సమస్తమైన భయాందోళననుండి విడుదలకు తాళపుచెవి రెండు పదములలో కలదు - పిచ్చుకలు మరియు తలవెంట్రుకలు'. ఆయన ఇలా అన్నారు, "మత్తయి 10:28-33 లో మీ తండ్రి సెలవులేక వాటిలో ఒకటైనను నేలనుపడదు. మీ తలవెంట్రుకలన్నియు లెక్కింపబడి యున్నవి జ్ఞాపకము లేదా?"

ఇది చాలా ప్రాథమికముగా మరియు స్వల్పముగ అగుపడినను యేసు బహులోతైన సంగతిని తెలియజేస్తున్నారు.

పాత నిబంధనలో రాజైన దావీదు అతిశయోక్తితో ఇలా ప్రకటించెను, "ప్రతివిధమైన భయమునుండి ఆయనన్నను విడిపించి యున్నాడు" భయమునుండి విడుదల దావీదు ఎలా పొందుకొనెను? భూమ్యాకాశములను సృజించినవాని గొప్పతనమును గూర్చి దేవోక్తి పొందుకొనుట వలనేకదా? సమస్తమును సృష్టించిన వానిపై దావీదు తన దృష్టిని సారింపగ, దేవుడు ఎంత గొప్పవాడో అతడు కనుగొనెను.

నేను దావీదుకు వలె ఉండనిష్టపడుచున్నాను. భయాందోళనల నుండి విడుదల పొందుట నేర్చుకొనిన కాపరినై ఇతరులను ఆ స్వాతంత్ర్యము లోనికి నడిపించువానిగా ఉండనాశిస్తున్నాను.

పిచ్చుకలు మరియు తలవెంట్రుకల మీద నేనొక పరిశోధన చేసాను. వెనువెంటనే దావీదుక దేవుడైన సృష్టికర్తనుగూర్చి ప్రత్యక్షతను పొందుకున్నాను. ఆయన సృష్టిలో సూక్ష్మమైన వాటిని గూర్చికూడా ఆయన శ్రద్ధవహించును.

## పిచ్చుకలు - దేవుని వర్తమానికులు

పిచ్చుకలు! పక్షులలో 9000 జాతులు గలవు. కాని వాటిలో యేసు పిచ్చుకను ప్రస్తావించెను. కేవలము అమెరికాలో 35 రకముల పిచ్చుకలు గలవు.

ఈ సున్నితమైన పక్షలు 22 రకములుగా కూయగలవు. వాటి కూతనుబట్టి వాటికి వివిధమైన పేర్లు గలవు.

పక్షులన్నిటికివలె, పిచ్చుకలు కూడా అద్భుతముగా చేయబడినవి. వాటి సన్నని, చిన్నవైన ఎముకలు బలముగా ఎగురుటకు అనుకూలముగా చేయబడినవి. సుమారు 2300 మైళ్ళు వలస వెళ్ళగలిగిన ఈ పిచ్చుకల రెక్కల నమూనాను, ఆధునిక విజ్ఞానశాస్త్రము ఇప్పటికి అనుకరించలేకయున్నది.

ఒక పిచ్చుకకు 1300 నుండి 2600 వెంట్రుకలు ఉంటాయి. ఎంత క్లిష్టమైన ఏర్పాటో సృష్టికర్తయైన మనదేవుడు క్రమబద్ధమైన రీతిలో వాటిని రూపొందించెను. ప్రతి ఎముకను, ప్రతివెంట్రుకను లెక్కించి రూపుదిద్దెను.

చాలా పిచ్చుకలు నేలమీద వాటి గూళ్ళు కట్టుకుంటాయి - క్రీస్తు కాలములో వాటిని వలవేసి పట్టుకునేవారు. యెరూషలేములో ఒక్కకాసుకు రెండు పిచ్చుకలు అమ్మబడుట యేసు చూచెను.

ఈ పిచ్చుకలను గూర్చి యేసు ఇట్లనెను, "నా తండ్రికి తెలియకుండా వీటిలో ఒక్కటీ పట్టుబడవు" వాటి చిన్న ఊపిరితిత్తులు చివరి శ్వాస విడుచువరకు అవి యెక్కడ ఉన్నవో ఆయన ఎరుగును. వాటిని పోషించువాడు ఆయనే.

## వెంట్రుకలు - తన బిడ్డల విషయమై దేవుని శ్రద్ధకు సూచన

వెంట్రుకలు - మన తలపైయున్న ప్రతి వెంట్రుక పరలోకమందున్న తండ్రిచేత లెక్కింపబడినది. మనుష్యుల తలపై 10,000 నుండి 150,000 వెంట్రుకలు ఉంటాయి. బట్టతలలు మీదకూడా వీలస్ రకమైన వెంట్రుకలు ఉంటాయి. ఇవి బహు సూక్ష్మమైనవి. కేవలము పైరూపము కొరకు మాత్రమేగాక వెంట్రుకలు ఉపయోగకరముగా నుండుటకు దేవుడు సృష్టించెను. వేసవికాలములో మరియు చలికాలములో తలకు సంరక్షణకొరకు వెంట్రుకలు ఇవ్వబడినవి. మన కనుబొమ్మలు చెమటనుండి మనకళ్ళను కాపాడును. మన కనురెప్పలపైనున్న వెంట్రుకలు దూళినుండి మన కన్నులను కాపాడును. చెవులలో మరియు ముక్కులోనున్న వెంట్రుకలు సూక్ష్మమైన పదార్థములను అడ్డగించును.

వెంట్రుకలు ఎంత అద్భుతకరమైనవి. వాటిలోగల జీవము మరియు అవి పనిచేయు విధానమును గ్రహించినప్పుడు, దేవుడు వాటిని లెక్కించునను సంగతిని ఎన్నడూ అనుమానించము.

ప్రతి తలవెంట్రుక కణముల సమ్మేళనై చర్మములో నుండి రక్తకణములను చేరుకొను మాధ్యమై యున్నది. ప్రతి వెంట్రుకలో నరములు, కండరములు మరియు కణములు ఉంటాయి. స్వల్పముగ జుట్టును తాకినను, వెంట్రుకలలో నున్న కణములు మెదడుకు కబురుపంపును. తద్వారా ఆ తాకిడిని మనము స్పర్శించగలము.

మెలనిన్ అనే పదార్థము తలకు రంగునిచ్చును. అది ఎదుగుచున్న తలలో ఉండును. బహు అఖండమైన రంగుల కర్మాగారమును దేవుడు మన తలపైనున్న చర్మములో నిర్మించియున్నాడు. కత్తిరించకుండా విడిచిపెడితే 25 అడుగుల వరకు జుట్టు పెరగగలదు.

కీర్తన 139:14లో దావీదు, "నీవు నన్ను కలుగజేసిన విధము చూడగ భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి," అని అనుట ఆశ్చర్యము కాదు.

మత్తయి సువార్తలో పిచ్చుకలు మరియు తలవెంట్రుకలను గూర్చి ప్రస్తావించి నప్పుడు యేసు తన శిష్యులకు భయపడవద్దని భోదిస్తున్నాడు. ఆయన ప్రతి పిచ్చుకను సృష్టించెను, ప్రతి మానవ దేహమును రూపించెను. మరియు ప్రతి తలవెంట్రుక లెక్కించెను. "ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయనద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను." (కొలొస్సీ 1:16-17).

కాని శిష్యులకింకను బోధపడలేదు. పిచ్చుకల యొక్క రెక్కలు మరియు ఎముకలు తయారుచేసిన విధానమును వారికి వివరించాలని యేసు ఎంత ఆశపడియుంటాడో.

ఆయన పేతురుతో ఇలా అని యుండవచ్చును, "పేతురూ నీ తలమీద 127,550 వెండ్రుకలున్నవి, నీ కుడి కనుబొమ్మ మీద 162 మరియు నీఎడమ కనుబొమ్మ మీద 165 వెండ్రుకలున్నవి. నీ గడ్డములో 33,980 వెండ్రుకలున్నవి. నీ తలమీద ఉన్న వెండ్రుకలన్నియు నేను లెక్కించి యున్నాను గనుక ఇప్పుడైనా నన్ను పూర్తిగా నమ్ముతావా? నీవు వేసే ప్రతి అడుగు నాకు తెలుసని నీవు నమ్మవేమి?"

లేదా యాకోబుతో ఇలా అనియుండవచ్చును, "ప్రియుడవైన యాకోబు నిన్నటికి భూమిమీద 2,396,000,065 పిచ్చుకలున్నవని నీవెరుగుదువా? గత 24 గంటలలో 2,000,603 ప్రకృతిరీత్యా మరణించినవి. మరియు 986,152 పిచ్చుకలు చంపబడినవి. యెరూషలేము సంతలో 2,950 అమ్మకానికి పెట్టబడినవి. పరలోకమందు నా తండ్రి సెలవియ్యకుండా దానిలో ఒక్కటైనను నేలను పడదు. ఇది ఎరిగిన నీవు దేని విషయములోనూ చింతింపక యుండగలవా? ఇకనుండైనా నీ అవసరములన్నీ నేను తీర్చగలనని నీవు నమ్మగలవా? ఏమితిందునో, లేక ఏమి త్రాగుదునో అని ఆలోచింపక యుందువా? నీ పరలోకపు తండ్రి వాటన్నిటిని సంతోషముగా నీకనుగ్రహించునని నమ్మగలవా? నీ సర్వపోషణ ఆయన చూచుకొనునని నీవిప్పుడు విశ్వసింపగలవా?"

## మన విషయమైన దేవుని తలంపులు లెక్కింపజాలనివి

దావీదు అంటున్నాడు, "యెహోవా నాదేవా, నీవు మాయెడల జరిగించిన ఆశ్చర్యక్రియలను, మాయెడల నీకున్న తలంపులును బహు విస్తారములు. వాటిని వివరించి చెప్పెదననుకొంటినా అవి లెక్కకుమించి యున్నవి" (కీర్తన 40:5).

"దేవా, నీ తలంపులు నాకెంత ప్రియమైనవి, వాటి మొత్తమెంత గొప్పది? వాటిని లెక్కించెదననుకొంటినా, అవి యిసుకకంటెను లెక్కకు ఎక్కువై యున్నవి." (కీర్తన 139:17-18)

బబులోను చెరలోనుండగ ఇశ్రాయేలీయులతో దేవుడు ఇలా సెలవిచ్చెను, "నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు నీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశ్యములేగాని హానికరమైనవి కావు" (యిర్మీయా 29:11).

నీవు పుట్టకముందే దేవుడు నీగురించి ఆలోచించెను. నీవు నీ తల్లిగర్భములో నుండగనే దేవుడు నీగురించి తలంచెను!

"నేను పిండమునై యుండగా నీకన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటైనా కాకమునుపే నా దినములన్నియు నీగ్రంథములో లిఖితము లాయెను" (కీర్తన 139:16).

"గర్భమునుండి నన్ను తీసినవాడవు నీవేకదా?..... గర్భవాసినైనది మొదలుకొని నాకు ఆధారము నీవే, నా తల్లి నన్ను కన్నది మొదలుకొని నా దేవుడవు నీవే" (కీర్తన 22:9-10)

ప్రభువు మనలోఉన్న ప్రతి అవయవమును గూర్చి ఆలోచన చేస్తారు. మన దేహములో నున్న ప్రతి వెండ్రుక, ఎముక, కండరము మరియు కణమును ఆయన లెక్కించి యున్నాడు, మనము కార్చిన ప్రతి కన్నీటిబొట్టును ఆయన లెక్కించి భద్రపరచియున్నాడు. " నా సంచారములను నీవు లెక్కించి యున్నావు, నా కన్నీళ్ళు నీబుడ్డిలో నుంచబడి యున్నవి. అవి నీ పుస్తకములో కనబడునుగదా?" (కీర్తన 56:8). దీనిని నేను పూర్తిగా గ్రహించలేను. ఆయన నా కన్నీళ్ళను లెక్కించును మరియు వాటిని భద్రపరచును. ఆలోచించండి వ్యర్థముగా కార్చబడిన కన్నీరు, (అవి దుఃఖ బాష్పములైనను, ఆనందబాష్పములైనను) లేవు. మనము నిద్రించుచున్నప్పుడు మరియు మెలకువగా నున్నప్పుడు కూడా ఆయన మన గురించి తలంచును. మనము వేయు ప్రతిఅడుగు ఆయనకు తెలుసు. మన ప్రతి తలంపు ఆయన ఎరుగును. "యేసు వారి ఆలోచనలెరిగి" అని వ్రాయబడియున్నది (లూకా 5:22).

పరలోకములో దేవదూతలు, కెరూబులు, సెరాపులు మరియు 24 పెద్దలైన మిక్కిలి వివేక సంపన్నులైన వారితో నిండుకొని యున్నది. మన దేవుని నమ్మకత్వమునకు వారే సాక్షులు. దేవుడు మనకు చేసిన ప్రతి వాగ్దానమును గూర్చి వారికి తెలుసు. మనకు దేవుడు చేయు ప్రతిచిన్న మేలును గూర్చి వారు వింటారు.

ఈ వాగ్దానములో ఒక్కదాని విషయములోనైనా దేవుడు తప్పిపోతే పరలోక మందంతట గొప్ప అల్లరి మరియు ఆందోళన చెలరేగుతుంది. ఎందుకనగా పరలోకపు బృందమంతా, "దేవుడు తన వాక్యమును నిలబెట్టుకొనలేదు, ఆయన నమ్మదగనివాడు' అని అంటారు. పరలోకమంతా

దేవునికి స్తుతిగానము చేయుచు తమ కిరీటములను ఆయన పాదములయొద్ద పెట్టుట ఆయన నమ్మకత్వమునకు సాక్ష్యమై యున్నది. ఆయన చెప్పింది తప్పక చేస్తాడు.

సమస్తమునకు క్రీస్తు చాలినవాడని ఒప్పుకొనవలెను. "భయపడకుడి మీరనేకమైన పిచ్చుకలకంటే శ్రేష్ఠులు. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును" (మత్తయి 10:31-33).

అనేక సంవత్సరములు పై వచనమును పట్టణవ్యాప్తమైన సువార్త సభలలో ప్రయోగపరిచాను. ప్రజలు ముందుకు వచ్చి క్రీస్తుని ఒప్పుకునేటట్లు చేయడానికి నేను ఇలా ప్రేరేపించేవాడిని. కాని "యేసూ నన్ను క్షమించు నీ యందు నేను విశ్వాసము ఉంచుచున్నాను" అని బహిరంగముగా ఒప్పుకొనుట దేవునియందు పూర్తి నమ్మిక యుంచినట్లు కాదు. కోట్లాదిమంది అటువంటి ఒప్పుకోలు చేసినా అది వారికి నిరుపయోగముగానే యున్నది.

యేసు చెబుతున్న విషయము గ్రహించుటకు తాళపుచెవి కీర్తన 31:19లో యున్నది. "నీయందు భయభక్తులు గలవారినిమిత్తము నీవు దాచియుంచిన మేలు ఎంతో గొప్పది. నరుల ఎదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది."

ఈ ఒప్పుకోలు కేవలము లోకము వినుటకుకాక చూచుటకు అనుకూలము కావలెను! "తనకు స్తోత్రరూపమగు క్రొత్తగీతమును మనదేవుడు నానోటనుంచెను. అనేకులు దానిని చూచి భయభక్తులు కలిగి యెహోవాయందు నమ్మికయుంచెదరు" (కీర్తన 40:3).

యేసుకు సాక్ష్యులైయుండుటను గూర్చి మనము మాట్లాడినప్పుడు మనకు తరచు వచ్చు దృశ్యము, వీధికూటములు, కరపత్రములు పంచుట మరియు సాక్ష్యము చెప్పుట. ప్రియులారా ఇవన్నీ దీనిలో ఒక భాగమే.

కాని దేవునియొక్క వాస్తవమును గూర్చిన సాక్ష్యము కొరకు లోకము చూచుటలేదు! పునరుత్థానమును గూర్చిన రుజువు కొరకు వెదకుట లేదు. సృష్టికథనమును వివరించు ఉపదేశముకొరకు చూచుట లేదు. ఉపద్రవములో, శ్రమలో, ఇబ్బందిలో, మరియు క్లిష్టపరిస్థితులలో నిశ్చింతగా నిలుచు క్రైస్తవుల కొరకు లోకము కనిపెట్టుచున్నది. దేవుని పిల్లలు తమ దేవునిపై పూర్తి నమ్మకము యుంచుట ఈలోకము చూడవలసి యున్నది.

ఒక క్రైస్తవుని చూపించి లోకమిలా వ్యాఖ్యానించవలసి యున్నది, "ఇదిగో, ఇతడే నిశ్చింతజీవి, కష్టకాలములో ఆయాసపడి భయముచేత కృంగిపోడు. రేపటినిగూర్చి చింతించడు ఎల్లవేళలా విశ్వాసము కలిగి యున్నవాడు."

నీకు తెలిసినా తెలియకపోయినా అనుదినము నీవు సాక్ష్యమిస్తున్నావు మరియు ఒప్పుకుంటున్నావు - నీ సహచరులకు, నీ కుటుంబమునకు, నీ తోడిపనివారికి నీ పొరుగువానికి, క్రీస్తునందు నీ సహోదరీ సహోదరులకు .

ఏదైనా ఒక క్లిష్టపరిస్థితిని నీవు ఎదుర్కొనుచున్నప్పుడు వారు నిన్ను చూస్తారు. మరియు నీ మాటలు వింటారు. తమలో తాము ఇలా అనుకుంటారు, "ఇతడు ప్రకటించినది పాటిస్తాడా? ఈ యేసు ఇతడిని విడిచిపెడతాడేమో? క్రీస్తుని ఒప్పుకొనని మనకువలె మాట్లాడుతాడా? లేక ప్రవర్తిస్తాడా?"

పరిస్థితులు ఇబ్బందికరమైనప్పుడు నీపెదవులనుండి ఎటువంటి మాటలు నీ చుట్టునున్నవారు వింటున్నారు? యెడతెగని విచారము ఒక విశ్వాసికి తగని సాక్ష్యము. దేవుడు నీ విషయములో తప్పిపోయాడేమోనని లోకము అభిప్రాయ పడేటట్టు చేస్తున్నావు. సమూయేలు తల్లియైన హన్నా ఆమె హృదయాన్ని ప్రభువుయొద్ద కుమ్మరించిన పిమ్మట ఆమె ముఖములో విచారమిక లేకపోయెను. (1 సమూ 15-18)

ప్రార్థన ముగించి ప్రభువు సన్నిధిని విడిచి వచ్చునప్పుడు నీవెలా ఉంటావు? ఇంకా దిగజారి విచారముగ ఉందువా? క్రుంగిపోయి యుందువా? అలాగైతే నీవు నిశ్చయముగా నీచింతను ప్రభువుమీద మోపి యుండలేదు. "యెహోవాయందు నమ్మికయుంచువారు కదలక నిత్యమూ నిలుచు సీయోనుకొండ వలెనుందురు" (కీర్తన 125:1)

సృష్టికర్తయైన గొప్పదేవుడు మన పక్షమునున్నాడు. మహాగొప్ప కార్యములు జరిగించు సమస్తమైన శక్తిగల సర్వోన్నతుడగు ప్రభువు మన పక్షమునున్నాడు. దారిపొడుగునా ఇదే యేసు తన బిడ్డలకు చూపించ ప్రయత్నిస్తున్నాడు. దేవుడు నీపక్షమునున్నాడు అను వాస్తవము మరియు దేవుని గొప్పతనమును గ్రహించమని ఆయన కోరుచున్నాడు, "నేను మొరపెట్టు దినమున నా శత్రువులు వెనుకకు తిరుగుదురు, దేవుడు నా పక్షముననున్నాడని నాకు తెలియును" (కీర్తన 56:9)

"యెహోవా నా పక్షమునున్నాడు, నేను భయపడను నరులు నాకేమి చేయగలరు? యెహోవా నా పక్షమున వహించి నాకు సహకారియై యున్నాడు. నా శత్రువుల విషయమై నా కోరిక నెరవేరుట చూచెదను" (కీర్తన 118:6-7)

భయముకు మరియు చింతకు కీర్తన 124 పరిశుద్ధాత్మచేత మనకివ్వబడిన విరుగుడై యున్నది. "మనుష్యులు మనమీదికి లేచునప్పుడు యెహోవా మనకు తోడైయుండని యెడల వారి ఆగ్రహము మనపైని రగులు కొనినప్పుడు యెహోవా మనకు తోడైయుండని యెడల వారు మనలను ప్రాణములతోనే మ్రింగివేసియుందురు. జలములు మనలను ముంచివేసియుండును. ప్రవాహము మన ప్రాణముల మీదుగా పొర్లిపారియుండును. ప్రవాహములై ఘోషించు జలములు మన ప్రాణముల మీదుగా పొర్లపారియుండును అని ఇశ్రాయేలీయులు అందురుగాక. వారిపండ్లకు మనలను వేటగా అప్పగింపని యెహోవా స్తుతినొందునుగాక. పక్షి తప్పించుకొనినట్లు మన ప్రాణము వేటగాండ్ర ఉరినుండి తప్పించుకొని యున్నది. ఉరి తెంపబడెను మనము తప్పించుకొనియున్నాము. భూమ్యాకాశములను సృజించిన యెహోవా నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది.

దుర్వార్తలపట్ల నిర్లిప్తధోరణి దేవుడు మన నుండి కోరుచున్నాడు. "వాని హృదయము యెహోవాను ఆశ్రయించి స్థిరముగా నుండును. వాడు దుర్వార్తకు జడియడు. వాని మనస్సు స్థిరముగా నుండును. తన శత్రువుల విషయమైన తన కోరిక నెరవేరువరకు వాడు భయపడడు" (కీర్తన 112:7-8)

"పండుకొనునప్పుడు నీవు భయపడవు నీవు పరుండి సుఖముగా నిద్రించెదవు. ఆకస్మికముగా భయము కలుగునప్పుడు దుర్మార్గులకు నాశనము వచ్చినప్పుడు నీవు భయపడవద్దు యెహోవా నీకు ఆధారమగును. నీకాలు చిక్కుబడకుండునట్లు ఆయన నిన్ను కాపాడును" (సామె 3:24-26)

నీ పూర్ణహృదయముతో దేవునియందు నమ్మికయుంచుము. సైన్యముల కధిపతియగు యెహోవామీద పూర్తిగా ఆనుకొనినప్పుడే భయాందోళనల నుండి నీవు స్వతంత్రపరచ బడెదవు. నిన్ను సృష్టించిన ఆయనయందు విశ్రమించుడి.

– డేవిడ్ విల్కర్సన్